క్లుప్తంగా

దళిత నేతకు మంద కృష్ణ మాదిగ పరామర్శ



సన్యాసిని పరామర్శిస్తున్న మందకృష్ణ మాదిగ

సబ్బవరం: మండలంలోని అమృతపురం గ్రామానికి చెందని సీనియర్ దళిత నాయకుడు సన్యాసిని మంగళవారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పరామర్శించారు. అనారోగ్యంతో ఇటీవల సర్జరీ చేయించుకున్న సన్యాసి ఆయన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఆయన సన్యాసిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులను ఆరా తీశారు. గొటివాడ సన్యాసి సేవలను గుర్తు చేస్తూ త్వరలోనే కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముమ్మిడివరపు సుబ్బారావు, తోతరముడి శ్రీను, మల్లి బాబు, సాధూరావు,చిన్నారావు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

పరవాడ: జీవీఎంసీ 79వ వార్డు దేశపాత్రునిపాలెం గ్రామానికి చెందిన నీల రాము(45) ఈ నెల 26 నుంచి కనిపించడం లేదని అతని కుమారుడు వర్ధన్ పరవాడ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. నీల రాము భార్య, ఇద్దరు పిల్లలతో దేశపాత్రునిపాలెంలో నివాసం ఉంటున్నాడు.ఈ నెల 26న మధ్యాహ్నం ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తండ్రి ఆచూకీ కోసం బంధువులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం పరవాడ పోలీసులను ఆశ్రయించారు. రాము ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని సీఐ పి.ఈశ్వరరావు కోరారు.

కార్మికులకు అండగా సీఐటీయూ పోరాటాలు



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

పరవాడ: ఫార్మాసిటీ ఆవరణలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జెండాను ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆవిష్కరించారు. 53 ఏళ్లుగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. కార్మికుల శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా సీఐటీయూ అనేక పోరాటాలు నిర్వహిస్తుందని గనిశెట్టి అన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్రి పోతినాయుడు, వెంకునాయుడు, చిన్నారావు, దేముడు, దొరబాబు, రాజు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, సాయికృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

- నాలుగేళ్లలో ప్రతి గడపకూ ప్రభుత్వ పథకాలు
- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- పెందుర్తిలో భారీ బైక్ ర్యాలీ



కార్పొరేటర్ ముమ్మన దేముడుకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



వేపగుంట కూడలిలోని మహానేత రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజలను ఆదుకున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ అని అదీప్‌రాజ్ చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తికావడంతో ఎమ్మెల్యే అదీప్ రాజ్ ఆధ్వర్యంలో మంగళవారం వేపగుంట నుంచి పెందుర్తి వరకు భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. తొలుత వేపగుంట జంక్షన్‌లోని దివంగత ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వైఎస్సార్‌సీపీ నాయకులకు, అభిమానులకు పంచిపెట్టారు. వేపగుంట నుంచి పెందుర్తి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పటినుంచీ అన్ని వర్గాల శ్రేయస్సు, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు.నవరత్నాలు ప్రవేశ పెట్టి ప్రతి గడపకూ సంక్షేమ కార్యక్రమాలు చేరవేసి చరిత్ర సృష్టించారని కొనియాడారు. నాలుగేళ్లలోనే 98 శాతానికి పైగా హామీలు అమలు చేసి రాజకీయాల్లో చరిత్ర లిఖించారన్నారు. నాలుగేళ్ల పరిపాలన అభివృద్ధి, సంక్షే మమే ధ్యేయంగా జరిగిందన్నారు. అన్ని వర్గాలు ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ భారీ స్థానాలు గెలుచుకుని మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారన్నారు. కార్యక్రమంలో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, పెందుర్తి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నక్క కనకరాజు, 94,97వ వార్డుల అధ్యక్షులు ఆదిరెడ్డి మురళి, మెంటి మహేష్, పార్టీ నాయకులు గొర్లె రామునాయుడు, బల్ల రాంబాబు, దాసరి రాజు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పౌరహక్కుల దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో హేమసుందర్రావు

పరవాడ: మండలంలోని రావాడ ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో వి.హేమసుందర్రావు పౌరహక్కుల విధివిధానాలను వివరించారు. అంటరానితనం నేరమని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 17 వ ఆర్టికల్‌లో ఉన్న అంశాలను వివరించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కులపై అవగాహన కల్పించారు. సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల ప్రవేశాలు, నిర్వహణ, వాటి విధుల వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రభుత్వం కల్పించే ప్రోత్సాహకాలను వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మంచినీరు, రహదారులు, విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఎస్సీ, ఎస్టీ వర్గాల వారు సద్వినియోగం చేసుకుని జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.ప్రకాశరావు, డీవీఎంసీ సభ్యుడు రేబాక మధుబాబు, సీఐ పి.ఈశ్వరరావు, సర్పంచ్ ఎం.సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, ఎంఈవో సునీత, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కోన రామారావు, ఈవోఆర్డీ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

బోరుబావి ఏర్పాటు



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ లావణ్య తదితరులు

సబ్బవరం: మండలంలోని బంగారమ్మపాలెం ఎస్సీ కాలనీ సమీపంలోని శ్మశానవాటికలో మంగళవారం బోరు ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన ఈ పనులను సర్పంచ్ దాడి లావణ్య ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దాడి కన్నంనాయుడు, పంచాయతీ వార్డు మెంబర్లు బత్తిన దేవుడమ్మ, దొడ్డి అర్జునరావు, పాల సొసైటీ అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు, దాడి గోవింద్,దొడ్డి అప్పారావు,దాడి గోవింద్,డి. అప్పారావు,బత్తిన కోటేశ్వర రావు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకుడు రామారావు

సబ్బవరం: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండాలని అనకాపల్లి సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం. రామారావు సూచించారు.మండలంలోని అమృతపురం రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. వీఏఏలు నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. అనంతరం మండలంలో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులతో సబ్బవరం రైతు భరోసా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమయ్యే పచ్చిరొట్ట ఎరువులపై అవగాహన కల్పించాలని సూచించారు. వరి విత్తనాలు,ఎరువులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులు విత్తనం వేసిన దగ్గర నుంచి పంట కోసే వరకూ అన్ని రకాల సాంకేతిక సూచనలు ఇవ్వాలని సూచించారు. అన్నదాతల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలు అమలు చేస్తూ రైతులకు మన్ననలు పొందాలన్నారు. పీఎం కిసాన్ పొందుతున్న రైతులకు సకాలంలో ఈకేవైసీ పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, ఏఈవో బాలరాజు,అన్ని రైతు భరోసా కేంద్రాల వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



అప్పన్న సన్నిధిలో రామచంద్రారెడ్డి తదితరులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీసింహస్వామిని మంగళవారం రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి వారి ప్రసాదం అధికారులు అందజేశారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా



వెస్ట్ ఏసీపీ కార్యాలయంలో కేసులపై ఆరా తీస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

గోపాలపట్నం: రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని నగరపోలీస్ కమిషనర్ త్రివిక్రమ్‌వర్మ సూచించారు. ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌తో పాటు సమీపంలోని ఏసీపీ కార్యాలయాలను మంగళవారం సీపీ ఆకస్మికంగా సందర్శించారు. లా అండ్ ఆర్డర్ వెస్ట్ సబ్ డివిజన్ కార్యాలయంలో కేసుల నమోదు, దర్యాప్తు విధానాలను పరిశీలించారు. మహిళలపై దాడులు జరగకుండా దిశ యాప్‌పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. డివిజన్ పరిధిలోని అన్ని స్టేషన్ల పనితీరుపై ఆరా తీశారు. ట్రాఫిక్ స్టేషన్, వెస్ట్ సబ్ డివిజన్ క్రైం ఏసీపీ కార్యాలయంలోనూ తనిఖీలు చేశారు. కార్యక్రమంలో వెస్ట్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, క్రైం ఏసీపీ సునీల్, సీఐ బీఎండీ ప్రసాద్, ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా గడప గడపకు..



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: జీవీఎంసీ 97వ వార్డు 497 సచివాలయం పరిధిలోని కార్మికనగర్, గిరిప్రసాద్‌నగర్‌లో మంగళవారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారి వివరాలు సేకరించారు. వారికి సంక్షేమ పథకాలు అందించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.కార్యక్రమంలో 97వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్ పాల్గొన్నారు.

1న పైడితల్లమ్మ పండగ నిర్వహణపై సమావేశం

సింహాచలం: అడవివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి వార్షిక పండగ నిర్వహణపై వచ్చేనెల 1న సమావేశం నిర్వహిస్తున్న సింహాచలం దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్ మంగళవారం తెలిపారు. కొండదిగువ నృసింహ సదన్ సత్రంలో ఆరోజు ఉదయం 11గంటల నుంచి సమావేశం జరుగుతుందని చెప్పారు. అడవివరం గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

రైతులకు పండ్ల మొక్కల పంపిణీ



ఆరిపాకలో రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న విజయ కుమార్

సబ్బవరం: మండలంలోని ఆరిపాక గ్రామంలో అనకాపల్లికి చెందిన గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. ట్రస్టు ఛైర్మన్ పువ్వల విజయకుమార్ మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా ట్రస్టు ద్వారా రైతులకు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. నిరుపేదలకు జీవనోపాధి కల్పించడానికి స్వయం ఉపాధి పథకాలు ఏర్పాటు చేసి వాళ్ల కాళ్ల మీద వారు నిలబడేలా చేస్తున్నామని చెప్పారు. ఆరిపాక పరిసర ప్రాంతాల్లో పేదలను గుర్తించి వారికి సహాయ కార్యక్రమాలు చేపట్టేవిధంగా ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఆర్. ఆనంద్‌కుమార్‌ను నియమించినట్లు తెలిపారు. 30 మంది రైతులకు కొబ్బరి,సపోటా,జామ వంటి మొక్కలు పంపిణీ చేశారు.

అంబికాబాగ్ రామాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఈవో శిరీష, ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ కొల్లి సింహాచలం



ప్రత్యేక అలంకరణలో విశ్వేశ్వర స్వామి

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 6.30 గంటలకు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అగ్ని ప్రతిష్ఠాపనతో అంకురార్పణ చేశారు. ధ్వజారోహణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె. శిరీష, ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు వెంకటరత్నం, అనురాధ, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు టి. తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం..

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం విశేష హోమాల అనంతరం ఉదయం 10.30 గంటలకు స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిపించనున్నారు.

సత్యదేవుని ఆలయంలో..

ఇసుకకొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో వార్షిక దివ్య కల్యాణోత్సవాలు మంగళవారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి బుద్ధ నాగ జగదీష్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం 7 గంటలకు స్వామి దివ్య తిరు కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు.

పోర్టు వెంకన్న ఆలయంలో ..

పోర్టు ఏరియా శృంగమణి పర్వతంపై వెలసిన వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం 6.30 గంటలకు స్వామి కల్యాణోత్సవం జరిపించనున్నారు.

నేడు విశ్వేశ్వరస్వామి కల్యాణం

సూర్యాబాగ్ మెయిన్‌రోడ్డులోని విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 31 నుంచి వార్షిక కల్యాణ మహోత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. బుధవారం రాత్రి 8.05 గంటలకు ఆలయంలో వేంచేసియున్న పరమశివశర్మన్ ముని మనుమడు మహనటేశ్వరవర్మన్ కుమారుడు విశ్వేశ్వరస్వామికి, మహమేరోర్న శర్మన్ ముని మనమరాలు, మందార చల శర్మన్ మనుమరాలు బాల త్రిపుర సుందరికి ఆలయ ప్రాంగణంలో పరిణయం జరిపించనున్నారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

1న సహస్ర తులసిపూజ

కనక మహాలక్ష్మి దేవస్థానంలో జూన్ 1న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు పూజా రుసుము రూ.1500 చెల్లించాలని ఈవో పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని రక్తదానం



రక్తదానం చేస్తున్న ఓలా ఉబర్ డ్రైవర్లు

డాబాగార్డెన్స్: ఓలా ఉబర్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం రక్తదానం చేశారు. సిటు 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో 120 మంది ఓలా ఉబర్ డ్రైవర్లు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రాజారత్నం మాట్లాడుతూ రక్తదానం చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. కారు డ్రైవర్లు ఐక్యంగా మంచి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విశాఖ క్యాబ్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి.జగన్ మాట్లాడుతూ ఓలా ఉబర్ యాప్‌లో లింక్ అయి 2,500 మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే పెట్రోలు, కారు ఇన్సూరెన్స్, అన్ని రకాల మెయింటెనెన్స్‌లు డ్రైవరే పెట్టుకుంటున్నప్పటికీ, వచ్చిన ఆదాయంలో 30 శాతం వరకు కమిషన్ నిర్వాహకులు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీరాములు, కార్యవర్గ సభ్యులు పోలినాయుడు, శరత్, ఎస్.అబ్బాయి, కృష్ణ, నాయుడు, మురళి, గోపి, ఆనంద్, లక్ష్మీనారాయణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

838వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వానికి సత్తా ఉంటే దేశ సంపదను సృష్టించాలి కానీ అమ్మకూడదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 838వ రోజు సంస్థకు చెందిన ఐఎస్ఎస్‌టీ, క్యూఏటీడీ, ఈటీఎల్, డీఎస్‌డబ్ల్యూ, సీఎండీ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణ కుట్రలో భాగంగా ఉక్కు ఉత్పత్తుల తయారీకి కావాల్సిన ముడి సరుకులను సమకూర్చకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రోజుకో విభాగంలో ఉత్పత్తిని నిలిపివేస్తూ కొన్ని విభాగాలను పూర్తిగా మూసివేసి, ప్రైవేటు వారికి కట్టబెట్టాలని ప్రయత్నం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరు మార్చుకోకపోతే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కనులపండువగా ఆలయ ప్రతిష్టాపనోత్సవాలు

అమ్మవార్లకు కలశ పూజలు



అమ్మవార్ల ఆలయానికి కలశాలతో ఊరేగింపుగా తరలి వస్తున్న మహిళలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు పరిధి తుంగ్లాం గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. గ్రామంలో నూతనంగా నిర్మించిన కుంచాలమ్మ, దుర్గాలమ్మ, ముత్యాలమ్మ వార్ల నూతన ఆలయాల ప్రారంభోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. అమ్మవార్ల ఆలయాల వద్ద విశేష పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో రెండో రోజు మంగళవారం ముగ్గురమ్మలకు కలశపూజలు నిర్వహించేందుకు మహిళలు కలశాలతో ఊరేగింపుగా తరలివెళ్లారు. ఆలయాల వద్ద అమ్మవార్లకు క్షీరాభిషేకం, చండీ యాగం, గణపతి హోమం, ఆవాహిత హోమ పూజలు వంటివి నిర్వహించారు. శిఖరంపై ప్రతిష్ఠించనున్న కలశాలకు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి క్షీరాధివాస పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

కార్మికుల ఐక్యతే సీఐటీయూ లక్ష్యం

అల్లిపురం: కార్మికులను ఐక్య పరచడమే సీఐటీయూ ప్రధాన లక్ష్యమని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ అన్నారు. సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో యూనియన్ ఉపాధ్యక్షుడు కె.ఎం.కుమార్ మంగళం అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ 1970 నుంచి ఈనాటి వరకు కార్మికుల కోసం సిటు పోరాడుతూనే ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 830 రోజులుగా చేస్తున్న పోరాటమే ఇందుకు సాక్ష్యమన్నారు. విశాఖ నగరంలో సుమారు 3 లక్షల మంది కార్మికులు ఉండగా సీఐటీయూలో కేవలం 40 వేల మంది మాత్రమే సభ్యులుగా ఉన్నారన్నారు. కనీసం లక్ష మంది సభ్యులుంటే మనం శాసించే స్థాయికి చేరుతామన్నారు.

నీలమ్మ వేపచెట్టు అమ్మవారి హుండీల ఆదాయం లెక్కింపు



దేవస్థానంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సేవా సంఘం ప్రతినిధులు, ఈవో రమాబాయి

అల్లిపురం: అస్సాంగార్డెన్స్‌లోని నీలమ్మవేపచెట్టు అమ్మవారి దేవస్థానం హుండీల లెక్కింపును మంగళవారం నిర్వహించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పీఎల్ఎన్ రాజు, ఈవో రమాబాయి ఆధ్వర్యంలో హుండీలు తెరిచి, శ్రీవారి సేవాసంఘం సభ్యుల సహకారంతో లెక్కింపు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు జోగారావు శర్మ , ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో..

అస్సాంగార్డెన్స్, శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పీఎల్ఎన్ రాజు, ఈవో రమాబాయి, ఆలయ అర్చకుడు భార్గవ శర్మ తదితరులు పాల్గొన్నారు.

బాలల దినోత్సవం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఎంవీపీ కాలనీ: అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు వాల్ పోస్టర్‌ను మంగళవారం ఉదయం ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాలలో ఆవిష్కరించారు. జూన్ 1వ తేదీన ఈ కళాశాలలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఫౌండేషన్ ప్రతినిధులు నరవ ప్రకాశరావు, జగదీశ్వరరావు, సత్య శాంతి, లత, రామారావు, బాబ్జీ పాల్గొన్నారు.